తన చేతులతో కష్టపడ్డాడు (అపో.కా. 20:33-35). అపోస్తలులు కూడా స్వహస్తాలతో పనిచేశారు. దేవుని నీతిని రాజ్యాన్ని మొదట వెతికితే, తిండి, బట్ట ఇస్తానని యేసు చెప్పాడు. సువార్త చెప్పేవాడు మాత్రమే సువార్తవలన జీవించాలంటే, సంఘం ఇచ్చేది సరిపోదని విదేశీ డబ్బు కాశపడి అన్యాయమైపోతున్నారు. ఇక్కడ సేవజేసినందుకు జీతం ఇక్కడే పొందితే, ప్రభువు ఇక జీతం తేడనే సంగతి ఆలోచనకే రావడంలేదు. కావున డబ్బు, ఆస్తి అంతస్తులు, ఉద్యోగం (స్వదేశీ - విదేశీ) లోక నాయకత్వం, విదేశీ ధనం, కార్లు ఇవేవి దేవుని ఆశీర్వాదాలు కావు. వీటిని మనమే కష్టపడితే సంపాదించుకోగలము. ఈ అంశము పూర్తిగా అర్థం కావాలంటే నేను వ్రాసిన 'యెహోవా కట్టిన ఇల్లు' పుస్తకం కూడా చదవగలరు. ఉచితంగా డబ్బు వచ్చి, మనవద్ద నిల్వ ఉంటుందంటే మనం దేవునికి దూరంగా జరిగిపోతున్నట్లే (లూకా 16:8-13).

మట్టి నుండి పుట్టిన దేహం తిరిగి మట్టిలోనే కలిసి పోకుండా నిత్యజీవాన్ని పొంది పరలోకం వెళ్ళాలంటే దేవుడిచ్చే పర సంబంధమైన ఆశీర్వాదాలనే కోరండి. సాతాను బోధకుల మాయ బోధల నుండి, చమత్కారమైన కల్పిత కథల జోలికి వెళ్ళకుండా, అనేకులను వెళ్ళనీయకుండా దేవుని ప్రేమకోసం, క్రీస్తు కృపకోసం, పరిశుద్ధాత్మ సహాయం కోసం నిరంతరం పరితపిస్తూ, దివారాత్రులు వాక్యాన్ని ధ్యానించి, పరిశోధించి, విశ్వాసాన్ని కాపాడుకొని మన పరలోకాన్ని తిరిగి చేరుకొందాం. వ్రాయబడిన ఈ అంశంపై ఇంకా ఏమైనా సందేహాలు, సమస్యలుంటే నన్ను సంప్రదించి సమాధానం పొందండి. దేవుని వాక్యానుసారంగా లేకపోతే నన్ను సరిదిద్దండి. సకలాశీర్వాదాలకు కారణభూతుడైన దేవుని ప్రేమ, ప్రభువైన యేసుక్రీస్తు కృప, పరిశుద్ధాత్మ సహవాసము, సమాధానముసదాకాలము మనందరికి తోడైయుండును గాక...

జీవముగల దేవుని సంఘంలో

మీ సోదరుడు **డా॥ బొంకూరి జాన్**

**Dr. BONKURI JOHN,** Director & Evangelist
**Institute of Bible Technology Hyd & Temples of God Meet Here Church**
Ph : 040-20000700 Cell : 9440142887
e-mail : johnbonkuri@bhelhyd.co.in www.bibletechnology.org

**Bible College :** #06-264/13/1/5H, HAL Colony, Opp. Godavari Homes, Suchitra Bus Stop to Quthbullapur Main Road, Chintal Post, Quthbullapur GHMC, Hyd - 500 054, India

**for Free Bible Training** contact : **Bro. J. RAVI,** Admn. Officer - IBT, H.No. 7-1-38/1/33, BJR Nagar, Ameerpet, Hyd-16, Cell : 9440792192, 9441383923, 9440551149, 9869469229, 9346469921, 9849554106, 9441727357, 9247128962, 9963623438, 9866509138, 9490453041, 9441366391, 9394756180, 9949242423, 9346373553



Note : For Circulation in Churchs only




దైవాశీర్వాదములు అనేమాట వినబడగానే కటిక దరిద్రుని నుండి ఆగర్భ శ్రీమంతుని వరకు ఒక రకమైన ఆశ చిగురించి, ఆ ఆనందముతో ముఖములో మార్పు కొట్టొచ్చినట్లు కనబడుతుంది. మన తరంలో కూడా చిన్నవారు మొదలుకొని కాటికి కాలుచాపుకొన్న వృద్ధుల వరకు మమ్మల్ని దేవుడు ఆశీర్వదించాలని ఎదురుచూస్తూ దైవాశీర్వాదం కొరకు దివారాత్రులు ప్రార్థించుచూ, పూజిస్తున్నారు. దైవాశీర్వాదం కోసం సువార్త సభలను ఆశీర్వాద పండుగలుగా మార్చేస్తున్నారు. ఉపవాస, కుటుంబ, ఎడతెగని ప్రార్థనలు, యజ్ఞ, యాగాదులు జరిపిస్తున్నారు. బలులు, అర్పణలు, మొక్కుబడులు చెల్లించేవారు, పుణ్యక్షేత్రాలు - పవిత్ర స్థలాలు దర్శించే వారనేకులు మనలో ఉన్నారు.

ఎవరింటికెళ్ళినా బ్రదర్ మాకోసం ప్రార్థించండి, కష్టాలు, ఇరుకులు, ఇబ్బందుల్లో ఉన్నాం, దేవుడు మమ్మల్ని ఆశీర్వదించాలని మీ అనుదిన ప్రార్థనలో జ్ఞాపకం చేసుకోండి అనేవాళ్ళు ఎక్కువయ్యారు. నేటి దినాలలో అనేకులు ఎక్కడెక్కడో తిరిగి అలసి, సొలసి చివరి ప్రయత్నంగా యేసుక్రీస్తును నమ్మితేనే ఏదో ఒకటి కలిసి వస్తుందని క్రైస్తవులుగా మారుతున్నారు. ఇంతకీ దేవుడు ఎలా ఆశీర్వదిస్తాడని ఆశిస్తున్న వారినడిగితే ఈ జీవితంలో జరిగే మేలులే కదండీ ఆ మాత్రం తెలియదా! ఎంతోమందిని ఆశీర్వదించిన దేవుడు మమ్మల్ని ఎందుకు ఆశీర్వదించడు? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. మానవజ్ఞానంతోనే ఆలోచించి మహోన్నతుని మహిమను మసి బూసి మారేడుకాయగా మారుస్తున్నారు. ఇంతకీ ఆశీర్వాదం అంటే ఏమిటి? ఈ పదం అర్థం ఏమిటీ, ఇదెలా ఉద్భవించిందో ఆలోచిద్దాం.

ఈ సృష్టిలోని సకల చరాచర జీవులలో జ్ఞానము - వివేకము కలిగిన నరుడొక్కడే ఆశాజీవి అని చెప్పక తప్పదు. నరుడికున్నన్ని ఆశలు - ఆశయాలు మరే జీవికి

లేవు. ఈ ఆశే లేకపోతే మనిషి జీవించలేడు. ఆది మానవుడి నుండి అధునాతన మానవుని వరకు ఆశల సౌధాలు పెరిగిపోతున్నాయే గాని తరగడం లేదు. ఆశించడం తప్పుగాదు కాని ఆశకు అంతు ఉండాలి. ఈ ఆశ దురాశగా మారితే అనగా ఆశించినది దొరక్కపోతే నిరాశలో పడి, నిర్వేదంలోపడి నిత్యాగ్ని దండనపాలయ్యే ప్రమాదముంది. మనకు చేతగానివి, అందనివి, మనం అందుకోలేనివి, అనగా ఆశించిన వాటిని వేరేవాళ్ళు ఉచితంగా ఇవ్వాలని ఆలోచించి వాటిని ఫ్రీగా పొందే విధానాన్నే ఆశీర్వాదం అంటారు. ఆశను తృప్తిపరచుటకే ఆశీర్వాదమనే పదం పుట్టుకొచ్చింది అని గ్రహించగలము. అడిగితే ఇచ్చేది దానము, అడగకుండా ఇచ్చేది బహుమానమైతే ఈ రెండింటికి మించినది లేదా అతీతమైనదే ఆశీర్వాదము అని చెప్పవచ్చు. బైబిల్ భాషలో అయితే ఏ నరుడు ఇవ్వలేనిది, దేవుడు మాత్రమే ఇచ్చేది ఆశీర్వాదం.

నేడు మన మధ్య ఉన్న సంఘాలలోని అనేకమంది బోధకులు, మీరు మా సంఘాలకొస్తేనే బహుగా ఆశీర్వదింపబడుతారని పదే పదే చెప్పి ఒక రకమైన హిప్నాటిజం చేస్తున్నారు. ఈ మధ్యనే వచ్చిన టి.వి. ఛానెళ్ళులోనైతే మరీ బరితెగించి కొందరు సువార్తికులు మా ప్రసంగం (అరగంటలో) విని ఆశీర్వాదాలు అందుకొన్న వారు మాకు వ్రాయండని, చందా తప్పక పంపమని, అలా పంపిన వారు ఎలా ఎక్కువగా ఆశీర్వదింపబడ్డారో సాక్ష్యాలు చూపిస్తున్నారు. సంఘానికో, దేవునికో ఎంత ఇస్తే అంతకు రెండింతలు పొందుతారని తమ బ్యాంక్ బ్యాలన్స్ పెంచుకొంటున్నారే గాని, మీ డబ్బు పరలోకంలో జమఅవుతుందని చెప్పేవారే కరువైపోయారు. నాటి నుండి నేటి వరకు బోధింపబడుతున్న బోధనల పర్యవసానమే ప్రతి విశ్వాసిలో నరనరాలలో జీర్ణించుకునిపోయి కడకు దేవుని వాక్యాన్నే కాదనే స్థితికి చేరిపోయారు.

క్రైస్తవులమని చెప్పుకొంటున్న వారిని ఎవరినడిగినా ఆశీర్వాదమనగానే ఆస్తి, అంతస్తు, ఉద్యోగం, వ్యాపారాభివృద్ధి, పంటలో అభివృద్ధి, సమాజంలో మంచి హోదా, ఉన్నత పదవులు, విదేశాల్లో ఉద్యోగాలు, చదువులు, రాజకీయ పలుకుబడి మరియు రాజకీయ నాయత్వం (వార్డు మెంబరు మొదలుకొని యం.ఎల్.ఏ, యం.పి., మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, దేశాధ్యక్షుడు) ఇలా ఎన్నో సంగతులను ఏకధాటిగా చెప్పేస్తున్నారు. ఇలాంటి శరీర సంబంధులిచ్చే సాక్ష్యాలను బట్టే క్రైస్తవేతరులలో గూడా ఈ విషయాలే బలంగా నాటుకొనిపోయి, శరీర అవసరాల కోసమే (ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, సామాజికంగా దెబ్బతిన్న వారే) ప్రార్థించమని చెప్పి, ఎక్కువ మంది ప్రార్థనలకొస్తూ క్రైస్తవులుగా మారుతున్నారు. మనిషి బలహీనతలను ఆధారం చేసుకొనే ఊరికో సంఘం, వాడకో సంఘం లేదా ఆశ్రమాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

ఈలోకాశలు, భూ సంబంధమైన ఆశీర్వాదాల ఆశలలోపడి, దేవుడు నిజంగా ఆయన ఇష్టానుసారంగా (వాక్యానుసారంగా) ఆశీర్వదించిన వారినే దరిద్రులుగా నిందించే స్థాయికి ఎదిగిపోయింది నేటి క్రైస్తవ్యం, క్రైస్తవేతర సమాజం. నేటి సంఘాలలో 99% మంది బోధకులు చెబుతున్న దైవాశీర్వాదములు బైబిల్‌కు భిన్నంగా ఉన్నాయంటే నమ్మలేక సత్యం చెప్పిన వారి సంఘాలకు రాలేని దశలో ఉన్నారు. క్రీస్తు సిలువ రక్తంతో రచించిన / చేసిన నూతన నిబంధనలోని అపోస్తలుల బోధవైపు అనగా సిలువ వేయబడిన క్రీస్తు బోధవైపు చూడక, ఆనాటి పాత నిబంధనలోని ప్రవక్తల బోధను, ఆనాటి వారిని ఆశీర్వదించిన వాక్యాలు మాత్రమే చూపెడుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. దీనికి కారణం బ్రతుకుదెరువుకోసం మాత్రమే బైబిల్ చేతబట్టి కడుపే దేవుడుగా చేసుకొన్న సాతాను అనుచరులే అని దేవుని ప్రజలు సాతాను తంత్రములను గ్రహించడంలేదు. అబ్రహామును, ఇస్సాకును, యాకోబును, యోబును, దావీదును, సొలోమోనును ఇలా మలాకి గ్రంథం వరకున్న వారిని చూపించి మాయ చేస్తున్నారు. వారి ఆజ్ఞలు వేరు, వారి సున్నతి వేరు, వారి దేశం (భూసంబంధమైనది - కనాను) పాలు తేనెలు ప్రవహించే ప్రదేశం వేరు అని అర్థం చేసుకోవాలి. క్రీస్తు సువార్తలో ఇదేదీ లేక మనం పరదేశులమని, పరసంబంధమైన ఆశీర్వాదం మనదని జ్ఞాపకం చేసేవారే కరువైనారు.

అయినా ఆదికాండము నుండి అనగా ఆదాము నుండి ఇశ్రాయేలు సమాజం వరకున్న ఆశీర్వాదమనే పదం, వారితో మాట్లాడిన విధానం చదివికూడా అర్థం చేసుకొని అంధులుగా మారిపోయారు. వాక్యము సెలవిచ్చినట్లుగా "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనపరుచు సువార్త ప్రకాశము వారికి (నాటి నుండి నేటి భక్తులందరికి) ప్రకాశింప కుండు నిమిత్తము, ఈ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనమును కలుగజేసి యున్నది" (2కొరింథి 4:4). అందుకే అనేకులు ఆత్మీయ అంధకారాన్ని, చదువు ఉన్నా బైబిల్ చదవరాని విద్యా విహీనతను పారద్రోలినా తరంలోని కొందరినైనా అగ్నిలోంచి లాగి రక్షించాలనే దేవుని ఆలోచన, ఆజ్ఞకు లోబడి, మరోసారి మీ అందరిచేత కాలాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి, బైబిల్‌ను చదివి గ్రహించి, దాని ప్రకారం ప్రవర్తించే వారుగా దేవుని ముందు నిలబెట్టాలని ఈ పత్రిక వ్రాయుచున్నాను (1పేతురు :8, 2తిమోతి 2:7, అపో.కా. 17:10,11, యాకోబు 1:20,21).

ఆదాము పాపం చేయక ముందు చేసిన తర్వాత దేవుని ఆశీర్వాదం గూర్చి చదువుదాం. "దేవుడు వారిని ఆశీర్వదించెను, ఎట్లనగా - మీరు ఫలించి అభివృద్ధి పొంది, విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచుకొనుడి..." (ఆది.కాం. 1:28, 9:7) భూమిని, దానిలోని సమస్తాన్ని మనమే లోబర్చుకోవాలి. ఆయన మనకధికారం ఇచ్చాడు. మనం ఎంత కష్టపడ్డా ఫలితం రానిది అదే దేవుని నిజమైన అనగా మనిషి అడగనిది, అనుకొననిది దేవుడే ఇచ్చిన ఆశీర్వాదం పిల్లలను కనడం. అందుకే నరుడు ఒంటరిగా ఉంటే ఆయనకే మంచిది కాదని అనుకొన్నాడు. పెళ్ళి అనే వ్యవస్థను ఆయన వలన కలిగినది అని వ్రాయించాడు. ఈ ఆశీర్వాదమే అబ్రామును

అబ్రహాముగా, యాకోబును ఇశ్రాయేలుగా మార్చి మనుషులకు మనుషులను బహుమానంగా ఇవ్వడమే ఆశీర్వాదమని బోధించి, పిల్లలను కనమని ఆజ్ఞాపించాడు (ఆది.కాం. 15:5,6, 16:10, 17:1-8, 20, 22:15-18, 26:1-5, 28:1-4, 35:9-12, 48:3,4, 15-16) ఆ తర్వాత ఇశ్రాయేలీయులు, దేవునియందు భయభక్తులు కలిగిన యోబు, దావీదు, సొలోమోను లాంటివారి చేతి పనిని దీవించి ఆస్తిపరులను చేసినా, దానిని వారు ఆశీర్వాదముగా చెప్పక పిల్లలను, పిల్లల పిల్లలను చూడడం కనడమే దేవుని ఆశీర్వాదమని కీర్తించారు. "పిల్లలు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము (ఆస్తి). గర్భఫలం ఆయన ఇచ్చు బహుమానమే, "యెహోవా యందు భయభక్తులు గలవాడు ఈలాగు ఆశీర్వదించబడును" (కీర్తన 127, 128 మరియు 107:30, 115:12-16) ఇలా పిల్లలే ఆశీర్వాదమని అర్థం గాని చిన్నపిల్లలు, ముసలివారు గ్రహించడం లేదు. పిల్లలను ఎక్కువమందిని కంటేనే భాగ్యవతి (ధనవంతురాలు)అన్నారు. గర్భం ధరించగానే శ్రీమంతం చేస్తారు. ఇంతకు పెళ్ళికార్డులోనే స్త్రీని చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి అని వ్రాస్తారు (చి॥ల॥సౌ॥). ఎంత ఆస్తిపరులైనా పిల్లలు లేని వారి బాధ వర్ణనాతీతమని, పెండ్లి అయినవారు కుమారుడు కావాలని ప్రార్థిస్తే కూతురు పుట్టడం, కూతురు కావాలంటే కొడుకు పుట్టడం ఎందుకు జరుగుతుందో తెలియని అయోమయంలో ఉండి, అర్థం కాక ఖర్మ, గ్రహచారం, తలరాత అని సర్ది చెప్పుకొంటున్నారు. ఇది మన ఖర్మగాదు దేవుని సంకల్పం, ఆశీర్వాదం. ఇది అర్థంగావాలంటే నూతన నిబంధనలోనికెళ్ళాలి. ఇది పాతనిబంధనలోని వారికి చెప్పలేదు దేవుడు.

"ఎట్లనగా తన ప్రియునియందు, తాను ఉచితముగా... యేసుక్రీస్తు ద్వారా తనకు పిల్లలనుగా స్వీకరించుటకై... జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను." (ఎఫెసి 1:3-6). దేవునికి పిల్లలు కావాలి గాబట్టే అబ్రామును అబ్రాహాముగా మార్చాడు, మనకు అడిగితే ఇవ్వక అడగకుండానే పిల్లలను ఆశీర్వాదంగా ఇస్తున్నాడు. అడిగితే ఇచ్చేది దానం కదా. అయితే నూతన నిబంధనలో పిల్లలే ఆస్తి అని, అయితే ఇది పరసంబంధమైనదేనని, అనగా మనతోపాటుగా పరలోకానికి తీసుకెళ్ళేది, పంపేది ఈ పిల్లలనే ఆస్తిని, ఆశీర్వాదాన్ని అని గ్రహించాలి. అయితే పిల్లలు లేనివారు ఆశీర్వదింపబడినవారు కారా? అని ప్రశ్నించే అవకాశం ఉంది గనుక, పిల్లలను వాక్యముతో కని అనగా దత్తత తీసుకొని క్రీస్తులో పెంచి పరలోకం పంపే వారు కూడా ఆశీర్వదింపబడేవారే. ఉదా॥ పౌలు తీతును, తిమోతిని అనేకులను వాక్యంలో కనడం. ఎందుకంటే పౌలుకు పెండ్లే కాలేదు అయినా అతడు ఆశీర్వదింపబడ్డవాడే.

అయితే ఈ అవకాశం కూడా ఉపయోగించుకొని వారికి సిలువ వేయబడిన క్రీస్తు బోధలో మరో అవకాశం ఇచ్చాడు. ఇది కూడా చేస్తే ఆశీర్వదింపబడినవారే. "అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి - నా తండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి. దప్పిగొంటిని, నాకు దాహమిచ్చితిరి, దిగంబరినై ఉంటిని, నాకు బట్టలిచ్చితిరి. పరదేశినైయుంటిని నన్ను చేరుకొంటిరి, రోగినైయుంటిని నన్ను చూడవచ్చితిరి. చెఱసాలలో ఉంటిని చూడవచ్చితిరి... అందుకు రాజు మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరని నిశ్చయంగా మీతో చెప్పుచున్నాననెను" (మత్తయి 25:31-46). ఇలా లోకంలోని అనాధలను కూడా ఆదుకొన్న వారు కూడా ఆశీర్వదింపబడిన వారేనని వాక్యం చెబుతుంది. దీంట్లో చిన్నా, పెద్ద, ఆడ, మగ తేడా లేదు కాని ఒక విషయం గమనించాలి. అదే మన ఆస్తిలో భాగాన్ని ఖర్చు చేయవలెనే గాని ధనం ఉచితంగా పొందే విషయాలు లేవు సుమా.

మన పుట్టుకకు, బ్రతుకుకు, పిల్లలను దేవుని కోసం క్రీస్తులా పెంచుటకు, అనాధలను ఆదుకొనుటకు అనగా అన్నింటికి అవసరమైన, అసలు సిసలైన, మరి శ్రేష్ఠమైన నిబంధనలోని దేవుని ఆశీర్వాదములు మనకెలా వస్తున్నాయి చూద్దాం.

ప్రతి ఆదివారపు ఆరాధనలో, కుటుంబ ఆరాధనలో, స్వస్థత - ఉజ్జీవ - రక్షణ - సువార్త కూటములలో, శుభకార్యములు, జ్ఞాపకార్థ కూటములతో సహా అన్నింటి చివరిగా ముగింపు ప్రార్థన చేశాక అయ్యగారు ఇచ్చే దైవాశీర్వాదములు తీసుకొని ఇంటికెళుతాం. అయితే ఇచ్చే వాడికి, తీసుకొనే వాడికి ఇది ఓ అలవాటు - ఆచారంగా మారిందే గాని అందులోని పరమార్థం గ్రహించుటలేదు. ఇదే అసలైనది ఈ ఆశీర్వాదముల ద్వారానే మనం పరలోకం చేరవలసి ఉందని ఆలోచించలేకపోతున్నారు. పైగా ఈ ఆశీర్వాదం లేకుండా ఎవ్వరూ లేవద్దని, ఇంటికెళ్ళకూడదని గట్టిగా చెబుతుంటారు. సభా నిర్వాహకులు, బోధకులు అదేనండి "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, తండ్రియైన దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ (మన) కందరికిని తోడైయుండును గాక!... " (2కొరింథి 13:14). వరుసక్రమం అప్పుడప్పుడు అటు-ఇటు అయినా ఇదే ఆశీర్వాదమని గ్రహించి ప్రవేశపెట్టినవారు ధన్యులు సుమా. అదెలాగో జాగ్రత్తగా ఒక్కొక్క దానిని ధ్యానిద్దాం. ఇందులో కూడా ధనానికి, చర-స్థిరాస్థులకు ఎంతమాత్రం స్థానం లేదు.

**తండ్రియైన దేవుని ప్రేమ :** దేవుని ప్రేమ అనగానే ఈ లోకంలో ఆయనిచ్చే ఉద్యోగం, ఆస్తి, అంతస్తు, కార్లు మొదలుగునవి అనే భ్రమలో ఉన్నారు. ఇక చదవండి బైబిల్‌ను "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా తన అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచువాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." (యోహాను 3:16, 5:24).

"మనము దేవుని ప్రేమించితినని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమైయుండుటకు తన కుమారుని పంపెను. **ఇందులో ప్రేమ యున్నది.**" (1యోహాను 4:7-11). దీనిని పూర్తిగా వివరించాలంటే ఈ కరపత్రము సరిపోదు. నేను వ్రాసే పుస్తకం "మానవ మేథస్సుకందని ప్రేమ" చదవండి. అయితే ఈ లోకంలో మనం బ్రతకడానికి కావల్సిన తిండి, బట్ట ఇచ్చి తండ్రిగా తన బాధ్యత నెరవేరుస్తూ, మనం పాప విమోచన పొంది పరలోకం వెళ్ళడానికి, మనం అడగకుండానే క్రీస్తు సిలువయాగం చేయించడంలోనే దేవుని ప్రేమ ఉన్నది. ఈ ప్రేమ దేవుడిచ్చిన గొప్ప ఆశీర్వాదం. దీనికిమించినది ఈలోకంలో ఏది లేదు. ఏది వద్దు కూడా ఈ ప్రేమ కావాలని దివారాత్రులు ప్రార్థించిన వారెందరున్నారో ఆలోచించండి.

**ప్రభువైన యేసుక్రీస్తు కృప :** "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడైయుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను." (2కొరింథీ 8:9). కృప అనే పదానికి ఇంగ్లీష్‌లో గ్రేస్ అని చెప్పాడు. దాని అర్థం జాలి, కరుణ, దయ అనే పర్యాయ పదాలకు సరిపోతుంది. ఈ లోకాన్ని సృష్టించిన వాడు అనగా దీని ధరకడితే ఎంతటి ధనవంతుడో ఆలోచించండి. ఈభూమి మీదనున్న మనల్ని ధనవంతులనుగా చేయడం కృప అంటున్నాడు. దీనిని పైపైన చూసిన మూర్ఖులు యేసు దగ్గరకొస్తే ధనవంతులవుతారని భ్రమపడుతున్నారు. ధనవంతుడు పరలోకం చేరడని, నీ ధనాన్ని అమ్మి బీదలకిచ్చి నన్ను వెంబడించమన్న వాక్యము (మత్తయి 6:19-24, 19:16-27, మార్కు 10:17-27, లూకా 18:18-27, 12:13-21, 1తిమోతి 6:3-10)లను మరచిపోయారు. ఒకని కలిమి విస్తరించుట వాని జీవానికి (లోకం బ్రతకడానికి కూడా) మూలం కాదన్నాడంటే ధనం ఎంతటి రక్తపిశాచో అనుగ్రహం పొందిన వారికే అర్థం అవుతుంది.

మరి ఈ ధనం లేక ఐశ్వర్యం విషయమైన కృప ఏమిటని ఆలోచిస్తున్నారు గదా! చదవండి. "క్రీస్తును గూర్చిన జ్ఞానం మీలో స్థిరపరచబడినందున ఆయన యందు మీరు ప్రతి విషయంలోను, అనగా సమస్త ఉపదేశములోను, జ్ఞానములోను ఐశ్వర్యవంతులైతిరి." (1కొరింథి 1:6, 4:7). వారి తొట్రుపాటు లోకానికి ఐశ్వర్యమును, వారి క్షీణదశ అన్యజనులకు (మనకు) ఐశ్వర్యమును అయినయెడల, వారి పరిపూర్ణత యెంత ఎక్కువగా ఐశ్వర్యకరమగును" (రోమా 11:11-14). లోకంకన్నా లోకాన్ని కలిగించిన వాక్యం చాలా ఖరీదైనదగును గదా! ఆ వాక్యాన్ని ఇశ్రాయేలీయుల నుండి మన స్వంతం చేయడానికి క్రీస్తు లోకానికి వచ్చాడు. ఈ (లోకాంతం) యుగసమాప్తి వరకు మనతో ఉంటానన్నాడు క్రీస్తు. దేవుని ఆజ్ఞ ప్రకారం మాత్రమే కాక మనయెడల ప్రేమ, దయ, కరుణతో మనకోసం సిలువలో మరణించాడు. ఇది ఆయన చూపిన కృప. ఈ కృప మన జీవితాంతం వరకు ఉంటేనే, అనగా దేవుని వాక్యంలో పరిపూర్ణులవుతేనే పరలోకాన్ని స్వతంత్రించుకొంటాం గనుక. వాక్యం దగ్గరున్న వాడే ప్రపంచంలో అందరికన్నా ధనవంతుడు కాదా! దీనిని దైవాశీర్వాదమనాలా వద్దా? ఇదే ఎల్లప్పుడు కావాల్సినది.

**పరిశుద్ధాత్మ సహవాసము :** సృష్టి ఆరంభం నుండి, ఈ సృష్టి అంతం వరకు పరిశుద్ధాత్మ మనకు వివిధ పేర్లతో కనిపిస్తాడు. అయితే యేసు పరలోకం వెళ్ళాక మనం అనాథలం కాక, ఆదరణ పొందుటకై సదాకాలము మనతో ఉండటానికి మనలోనికి పంపాడు. ఆయన మనలో ఉంటే మనం దేవుని పిల్లలం కాగలం శరీర క్రియలను చంపి నీతిమంతులం కాగలము (రోమా 8:9-26). పరిశుద్ధాత్మ ఉంటే క్రీస్తు ప్రభువని చెప్పగలం. క్రీస్తు ద్వారానే తండ్రికి ప్రార్థన, విజ్ఞాపనలు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించగలము. ఆత్మ సహాయం ఉంటేనే వాక్యాన్ని అర్థం చేసుకోగలము, బోధించగలము, అనేకమైన తప్పుడు బోధలను ఖండించి, బుద్ధి చెప్పి, సరిదిద్దగలము (1కొరింథి 2:10-15). దేవునిని ఆరాధించాలంటే ఈ ఆత్మ సహవాసం, సహాయం తప్పనిసరి (యోహాను 4:24). దీనిని మనకు ఉచితంగా ఇచ్చాడు. దీనిని అడుగమన్నాడు, ఒకప్పుడు కనిపెట్టమన్నాడు. ఇప్పుడైతే బాప్తీస్మం తీసుకోగానే వరంగా (అపో.కా. 3:38) ఇస్తున్నాడు. గనుక ఈ ఆశీర్వాదం గూడా ఎంతో ముఖ్యమైనది. దీనిని ఆశీర్వాదంగా ఆశిస్తున్న వారెంతమంది ఉన్నారో మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి.

ఇప్పటికైనా ఆత్మతో ఆలోచించే విశ్వాసులు గ్రహించారనుకొంటాను. నిజమైన దైవాశీర్వాదమంటే ఏమిటో. ఇంకా మూర్ఖంగా ఏ రిఫరెన్స్ తీసి నాతో వాదించాలను కొంటున్నారా? అయితే మనం దేవునిని నమ్ముకొన్న వాళ్ళం కాని దేవుడే ఎంచుకొన్న లోకసంబంధులైన ఇశ్రాయేలీయుల నుండి (ఆస్తి, అంతస్తులే ఆశీర్వాదాలుగా రుచిచూసిన వారినే) ప్రత్యేకంగా పట్టుకొన్న అపోస్తలులను ఆశీర్వదించిన విధానం చదవండి మీ బైబిల్ తీసి **1కొరింథి 4:8-13, 2కొరింథి 4:7-12, 6:3-10, 11:18-28.** మరి ముఖ్యముగా ఈ లోకంలో దొరికే మేలు (ఆశీర్వాదాలనుకొని) లనుకొని క్రీస్తునందు నిరీక్షణ కలిగి యుంటే (నమ్మని) మనుష్యులందరికంటె దౌర్భాగ్యులము అని చెప్పాడు (1కొరింథి 15:19). ఇంకా యేసు ఎవరి ఇంటికొస్తే వారికి రక్షణ వస్తుంది, అయితే ఇంట్లోంచి ధనం వెళ్ళిపోతుంది (లూకా 19:1-10). ఇది నమ్మిన మొదటి శతాబ్దపు క్రీస్తు సంఘం తమ చరస్థిరాస్తులను అమ్మారు (అ.పో.కా. 2:43-47, 4:32-35, 5:1-11). ఈ సంగతులు నేటికి బైబిల్‌లో ఉన్నా, బోధించే బోధకులు, బోధ మారింది గనుకనే దైవాశీర్వాదాల పేరిట దేవుని సంఘం (చర్చి) ఆస్తులను నమ్మి తమ ఇండ్లు కట్టుకొంటున్నారు నేటి క్రైస్తవులు దేవుడు బహుగా ఆశీర్వదించాడని చెబుతున్నారు.

కష్టపడ్డ ప్రతి వారికి కడుపు నిండుతుందని ఆదాము నుండి నేటికి చెబుతున్నాడు దేవుడు (ఆది.కాం. 3:17-23, 2థెస్స 3:6-12). అన్యజనులకు అపోస్తలుడైన పౌలు